క్లుప్తంగా

ఘనంగా పైడిమాంబ పండగ



హోమంలో ఆహుతులు సమర్పిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: 75వ వార్డు పెదకోరాడ గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్ద పులి అప్పలరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. హోమం జరిపించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, బసా గోపాలరెడ్డి, శీరపు వెంకటరావు, వెంపాడ సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ బ్లాక్ పాత ఆర్‌టీవో కార్యాలయం రోడ్డులో మజ్జిగ చలివేంద్రాన్ని పారిశ్రామిక వేత్తలు మంగళవారం ప్రారంభించారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఏపీఐఐసీ–ఐలా జీఎస్ఐ ఎమ్ఐఏఎస్ సొసైటీ, పీఐడబ్ల్యూఏలకు చెందిన పారిశ్రామిక వేత్తలు సంయుక్తంగా పాల్గొని, చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణం రాజు, వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ శేషగిరిరావు పాల్గొన్నారు.

చిన్నారులకు లెమన్ స్పూన్ పోటీలు



లెమన్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు మంగళవారం లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. విద్యార్థులు పాల్గొన్నారు.

1న గురజాడ కళాక్షేత్రం పునఃప్రారంభం



గురజాడ కళాక్షేత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రం జూన్ 1 నుంచి పునఃప్రారంభం కానుంది. కరోనా సమయంలో రెండేళ్ల క్రితం ఈ కళాక్షేత్రాన్ని కోవిడ్ సెంటర్‌గా మార్చారు. ఆ తర్వాత మూడు నెలలకే కరోనా తీవ్రత తగ్గిపోయింది. అయినప్పటికీ, గురజాడ కళాక్షేత్రం రెండేళ్లుగా ఉద్యోగులకు అందుబాటులో లేకుండా పోయింది. ఉద్యోగులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు యాజమాన్యం కళాక్షేత్రం పునరుద్ధరణ పనులు చేపట్టింది. మే 22 నుంచి మరలా ఆన్‌లైన్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1 నుంచి ఫంక్షన్లు చేసుకునేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికార వర్గాల సమాచారం.

జగనన్న విద్యా కానుక సిద్ధం

- నియోజకవర్గానికి 12,131 కిట్లు
- 85 పాఠశాలల విద్యార్థులకు లబ్ధి



సిద్ధంగా ఉన్న బూట్ల స్టాక్



స్టాక్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

గాజువాక : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను అధికారులు సిద్ధం చేశారు. గాజువాక, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లకు ఈ కిట్లు ఇప్పటికే చేరాయి. పాఠశాలలు తెరవకముందే విద్యార్థులకు కిట్లను అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మంగళవారం స్టాక్‌పాయింట్‌ను పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గాజువాక మండలంలో 48 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 7,486 కిట్లు, పెదగంట్యాడ మండలంలోని 37 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 4,645 కిట్లను సిద్ధం చేసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 12,131 కిట్లను సిద్ధం చేశారు. ఈ కిట్ల కోసం ఆయా పాఠశాలల్లో ప్రత్యేక గదులను కేటాయించారు. ఒక్కో పాఠశాలలో సుమారు ఏడు గదులను కేటాయించి మొత్తం కిట్లను వాటిలో భద్రపరిచారు. బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, బూట్లు, సాక్సులు, టైలు, ఒక్కక్కరికీ మూడు జతల యూనిఫారాలతో కూడిన కిట్లను విద్యార్థులకు అందజేయనున్నారు. ఇవిగాక విద్యార్థుల కోసం 10,250 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు కూడా మంజూరయ్యాయని, గొడౌన్లలో ఉన్న ఈ డిక్షనరీలను ఈ నెల 30లోగా స్టాక్ పాయింట్లకు తీసుకొస్తామని అధికారులు పేర్కొన్నారు. స్టాక్ పాయింట్లకు చేరిన కిట్లను క్వాలిటీ కంట్రోల్, మానిటరింగ్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నాయి. ఈ టీమ్‌లతో పాటు జిల్లా విద్యాశాఖాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, స్థానిక బాధ్యులకు అవసరమైన సూచనలు చేస్తున్నారు.



సిద్ధంగా ఉన్న జగనన్న విద్యా కానుక కిట్లు

ప్రతి విద్యార్థికి జేవీకే కిట్

ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్‌ను అందజేస్తాం. ఈ కిట్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశాం. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే కిట్లను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఆదేశాల ప్రకారం జిల్లా విద్యాశాఖాధికారులు జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం చేశారు.

– కె.జనార్దనరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, గాజువాక జెడ్పీ హైస్కూల్

824వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు విశాఖ ఉక్కు పరిశ్రమ ఎంతో దోహదపడుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి పరిశ్రమను అమ్మేందుకు యత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉక్కు కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 824వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కుపరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. సంస్థ ఆస్తి విలువను తక్కువగా చూపించి, కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేయాలని చూడడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుకు నేటి వరకు నష్టాలు లేవన్నారు. ప్రభుత్వం ఎటువంటి సహాయసహకారాలు అందించకపోయినా లాభాలతో సంస్థను మరింత విస్తరించుకున్నామన్నారు. ప్రభుత్వం చెబుతున్న అప్పులకు మూడు రెట్లు విలువైన సంపద విశాఖ ఉక్కులో ఉందని గుర్తు చేశారు. ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 73వ వార్డు వినాయకనగర్ వుడా కాలనీలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో 95 శాతం పథకాలను అమలు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, సత్యం, పైడినాయుడు, ప్రసాద్, రెడ్డి జగన్నాథం, ఆలీ, పాల అప్పలరెడ్డి, జి.వెంకటరావు, డి.సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రస్తా స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



రస్తా స్థలం అంశాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్‌కు వివరిస్తున్న బోగాది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో ఈఎస్ఐ ఆస్పత్రికి కేటాయించిన స్థలాన్ని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 113లో ఆస్పత్రికి స్థలం కేటాయించక ముందు తమ గ్రామానికి రస్తా ఉండేదని, ఆ స్థలంలో ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే తమకు దారి లేకుండా పోతుందంటూ గ్రామస్తులు అధికారులకు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి వచ్చిన ఆర్డీవో, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. రస్తా సమస్యను, దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని 69వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బోగాది సన్యాసిరావుతో పాటు గ్రామ పెద్దలు ఆర్‌డీవోకు వివరించారు. సర్వే నంబర్ 112, 113లో నాతయ్యపాలెం గ్రామం నుంచి షీలానగర్‌ను కలుపుతూ హైవేకు రస్తా ఉండేదని, ప్రస్తుతం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరపతలపెట్టిన దృష్ట్యా రస్తా నిర్మాణంపై ఈఎస్ఐ ఆస్పత్రి అధికారులతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన వివరాలను ఆర్డీవోకు చూపించారు. ఆస్పత్రి స్థలంలో ఉన్న డ్రైన్‌ను రైతుల పొలాల్లోకి మళ్లించారని, దీనివల్ల మురుగు నీరుతో పొలాలన్నీ కలుషితంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై జిల్లా జాయింట్ కలెక్టర్‌తో సమావేశం నిర్వహించిన తరువాత పరిష్కారాన్ని ఆలోచిస్తామని ఆర్డీవో చెప్పారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్, ఆర్ఐ బి.విజయ, వీఆర్వో ఆనంద్, ఈఎస్ఐ ఏడీ కృష్ణ తదితరులున్నారు.

నేత్రపర్వం.. కుంచుమాంబ అనుపోత్సవం



కుంచుమాంబ సన్నిధిలో వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక : గాజువాక గ్రామ దేవత కుంచుమాంబ అనుపోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. పాత గాజువాకలోని మెయిన్‌రోడ్డును ఆనుకొని ఉన్న కుంచుమాంబ ఆలయంలో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పులివేషాలు, తప్పెటగుళ్లు, వివిధ నృత్యాలతో అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. గాజువాక మెయిన్ రోడ్డు, జాతీయ రహదారిపై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ ఉరుకూటి అప్పారావు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దోమకాటు .. ఆరోగ్యానికి చేటు

పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డెంగ్యూ డే ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న గాజువాక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



87వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



77వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దేవాడ పీహెచ్‌సీ సిబ్బంది

గాజువాక : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ అన్నారు. జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పగలు కుట్టే దోమల వల్ల డెంగ్యూ జ్వరాలు ప్రబలుతాయన్నారు. అందువల్ల దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే వాటిని నాశనం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఫ్రిజ్‌లు, ఏసీలను ఉండే నీటి నిల్వలను వారానికొకసారి చూసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు నాగరాజు, విజయలక్ష్మి, గీతా ప్రియదర్శిని, సీహెచ్‌వోలు పి.నాగ అప్పారావు, ఎస్ఎస్‌వీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

68వ యూపీహెచ్‌సీలో..

అక్కిరెడ్డిపాలెం: డెంగ్యూ దినోత్సవం సందర్భంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం ఎదురుగా గల యూపీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాజువాక ఏఎంవోహెచ్ డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ పాల్గొని స్థానికులకు డెంగ్యూ వాధి వ్యాపించడానికి గల కారణాలను వివరించారు. అనంతరం గ్రామంలోని యాంటీ మలేరియా యూనిట్, యూపీహెచ్‌సీ, సచివాలయాల హెల్త్ సిబ్బందితో నిర్వహించిన ర్యాలీను ప్రారంభించారు. గాజువాక యాంటీ మలేరియా యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.వరహాలు దొర ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో ఏఎంవో సీహెచ్.సత్యనారాయణ, యూపీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

పెదగంట్యాడ: 77వ వార్డు దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ పి.ప్రదీప్ ప్రసాద్ రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం విధిగా డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో ఆనంద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి పీహెచ్‌సీ మెయిన్ రోడ్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చని డాక్టర్ సుధాకర్ తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఏ ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎంపీహెచ్ ఈవో బాబీ, ఏఎంవో సత్యనారాయణ, ఏఎన్ఎంలు, మలేరియా నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేరాల నియంత్రణలో తోడ్పాటు అందించాలి
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీఫుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ-2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు

సిటూ నాయకుడు కన్నారావుకు నివాళి



కన్నారావుకు నివాళులర్పిస్తున్న జీవీఎంసీ వర్కర్స్ యూనియన్

అగనంపూడి: కార్మికుల సమస్యలపై నిబద్ధతతో, రాజీలేని పోరు చేసిన కన్నారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.అప్పారావు అన్నారు. సిటూ అగనంపూడి కమిటీ అధ్యక్షుడు ఉప్పల కన్నారావు సోమవారం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడంతో అగనంపూడిలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. కన్నారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్.రాజు, బి.కనకరాజు సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థుల ఔదార్యం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతికి రూ.లక్ష సాయం



చికిత్స పొందుతున్న యువతితో మాట్లాడుతున్న ఆచార్య హరనాథ్

ఏయూ క్యాంపస్ : ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వర్సిటీ పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పందిరి అనూరాధ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. పేద కుటుంబానికి చెందిన అనూరాధ చికిత్సకు అధికంగా ఖర్చవుతోంది. విషయం తెలుసుకున్న ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు జి.ధర్మారావు, వై.గోపీచంద్ తమ స్నేహితులు, బంధువుల నుంచి విరాళాలు సేకరించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనూరాధను సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ స్వయంగా కలిసి విద్యార్థులు సేకరించిన రూ 1,011,11ని బాధితురాలి తండ్రి రాముకు అందజేశారు.

'సర్వహిత' ట్రస్ట్ చైర్మన్‌గా మస్తాన్‌రెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

అగనంపూడి: పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎం.మస్తాన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కిడిమి హనుమంతురావు, ప్రధాన కార్యదర్శిగా జామి గణేష్, కోశాధికారిగా పొన్నగంటి కొండలరావు ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షునిగా శీరంశెట్టి గోవిందరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా లక్కరాజు రాము, సంయుక్త కార్యదర్శిగా పిళ్లా శ్రీనివాస్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రధాన సలహాదారు పట్టా రామ అప్పారావు, గంధోళి నరసింగరావు, వానపల్లి వెంకటరమణల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.

డీఈవో ఆకస్మిక పర్యటన



ఐరన్ ట్యాబ్లెట్లు వాడిన విద్యార్థిని ఆరోగ్యంపై తల్లిదండ్రులను ఆరా తీస్తున్న డీఈవో చంద్రకళ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డీఈవో చంద్రకళ ఆకస్మికంగా పర్యటించారు. మంగళవారం రాత్రి 7.45 గంటల ప్రాంతంలో జెడ్పీ పాఠశాలకు చేరుకున్న ఆమె, ఆ సమయంలో పాఠశాలలో విధుల్లో ఉన్న హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఐరన్ లోపం ఉన్న విద్యార్థులకు పంపిణీ చేసిన ఐరన్ మాత్రలు సరిగ్గా అందాయా, వాడుతున్నారా అని తల్లిదండ్రులను ఆరా తీశారు. మాత్రలు వాడాక ఎలా ఉందని అడిగి తెలుసుకుని, వివరాలు నమోదు చేసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా ఒక విద్యార్థితో చదివించి, సంతృప్తి వ్యక్తం చేశారు. 8వ తరగతి విద్యార్థినికి అందజేసిన ట్యాబ్‌ను పరీక్షించారు. విద్యార్థులు చదువులో ఎలా రాణిస్తున్నారని వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రెస్ కార్డులు అందించారా అని ఆరా తీశారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో 8 ఇళ్లలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, పలు అంశాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీసీ బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్.దేముళ్లు, జి.పద్మజ పాల్గొన్నారు.

31న అమ్మవార్ల ఆలయ పునః ప్రతిష్ట

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో నిర్మించిన శ్రీ కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యాలమ్మ అమ్మవార్ల దేవాలయాల పునస్థిర ప్రతిష్టా మహోత్సవాన్ని మే 31వ తేదీన నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోదండ రామాలయం వద్ద మంగళవారం మహోత్సవ ఆహ్వాన పత్రికను గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లలితా పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి దివ్య ఆశీస్సులతో ఆలయాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.